శుక్రవారం హైదర్‌గూడలోని ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆటో డ్రైవర్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా అసెంబ్లీకి ఆటోల్లో బయలుదేరగా.. బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు ప్లకార్డు చేబూని ఆటోలో ప్రయాణిస్తూ నిరసన తెలిపారు.

టెన్త్ సెంటర్లు @ 98

ఖమ్మం జిల్లాలో 96 రెగ్యులర్, రెండు 'ప్రైవేట్' కేంద్రాల ఏర్పాటు
పరీక్ష రాయనున్న 16,514 మంది ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులు
చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ల ఎంపికలు పూర్తి
ఇన్విజిలేటర్ల గుర్తింపునకు వివరాలు సేకరిస్తున్న జిల్లా అధికారులు

ఖమ్మం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 9 : ఈ ఏడాది ఖమ్మం జిల్లాలో 98 కేంద్రాల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలను అధికారులు నిర్వహించనున్నారు. వీటిల్లో రెగ్యులర్ విద్యార్థుల కోసం 96 రెగ్యులర్ కేంద్రాలు, సప్లిమెంటరీ విద్యార్థుల కోసం రెండు ప్రైవేటు కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు కలిపి మొత్తం 16,514 పరీక్షలు రాయనున్నారు. పరీక్షలకు సమయం సమీపిస్తున్నందున వాటి నిర్వహణ కోసం చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ల ఎంపికకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. అలాగే, ఇన్విజిలేటర్ల గుర్తింపు కోసం వారి వివరాలను జిల్లా అధికారులు సేకరిస్తున్నారు.

77 ప్రభుత్వ, 19 ప్రైవేట్ కేంద్రాలు..

ఈ ఏడాది మార్చిలో జరుగనున్న పది పరీక్షల కేంద్రాలను కేటాయించేందుకు జీవో నెంబర్ 151/బీ-2 ద్వారా ప్రభుత్వం ప్రత్యేక మార్గదర్శకాలను జారీ చేసింది. ఏయే అంశాలను పరిగణనలోకి తీసుకొని కేంద్రాలను ఎంపిక చేయాలో అందులో స్పష్టంగా పేర్కొంది. కేంద్రాల ఎంపికకు పరిశీలించాల్సిన ప్రాధాన్యాలను స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో అధికారులు ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్ పాఠశాలలు, మోడల్ స్కూళ్లు, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ పాఠశాలలను పదో తరగతి పరీక్ష కేంద్రాలుగా గుర్తించాలని స్పష్టం చేసింది. విద్యార్థుల సంఖ్య ఆధారంగా జంబ్లింగ్ పద్ధతిలోనే కేంద్రాలను ఎంపిక చేస్తున్న తరుణంలో ప్రభుత్వ పరిధిలోని పాఠశాలలకు ప్రథమ ప్రాధాన్యం కల్పించారు. పరీక్షలు జరిగే సమయంలో, నిర్వహణలో ఎలాంటి ఆటంకాలూ ఏర్పడకుండా ఉండడంతో పాటు ప్రశాంతమైన వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేందుకు కేంద్రాలను ఎంపిక చేశారు.

రెగ్యులర్ విద్యార్థుల కోసం 96 కేంద్రాలను ఎంపిక చేయగా.. వీటిలో 77 ప్రభుత్వ, 19 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. నిరుడు 103 కేంద్రాల్లో టెన్త్ పరీక్షలు నిర్వహించిన అధికారులు.. ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య తగ్గడంతో పరీక్ష కేంద్రాలను కూడా కుదించారు.

జోన్లుగా విభజన..

జిల్లాలో టెన్త్ పరీక్షలకు హాజరయ్యే ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు జంబ్లింగ్ విధానంలో కేంద్రాలుగా కేటాయించనున్నారు. దీనిలో భాగంగా ఖమ్మం జిల్లాలోని 423 పాఠశాలలను 44 జోన్లుగా విభజించారు. అలాగే, పరీక్షా కేంద్రాలను ఏ, బీ, సీ కేంద్రాలుగా విభజించారు. జిల్లా, మండల కేంద్రాల్లో ఉన్న స్కూళ్లను 'ఏ' సెంటర్లుగా గుర్తిస్తారు. పోలీస్ స్టేషన్‌కు '8' కిలోమీటర్ల పరిధిలో ఉండే పరీక్ష కేంద్రాలను 'బీ' కేంద్రాలుగా గుర్తిస్తారు. పోలీస్ స్టేషన్‌కు '8' కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరంగా ఉండే కేంద్రాలను 'సీ' కేంద్రాలుగా గుర్తిస్తారు.

16,514 మంది విద్యార్థులు...

ఖమ్మం జిల్లాలో 282 ప్రభుత్వ పాఠశాలల్లోని 10,146 మంది విద్యార్థులు, 141 ప్రైవేట్ స్కూళ్లలోని 6,368 మంది విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. ఖమ్మం నగరంలో 100కిపైగా విద్యార్థులున్న స్కూళ్లు ప్రైవేట్‌లో ఎనిమిది, ప్రభుత్వంలో నాలుగు ఉన్నాయి. అత్యధికంగా న్యూవిజన్‌లో 487 మంది, శ్రీచైతన్యలో 446 మంది, త్రివేణిలో 216 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్ఎస్‌పీ కెనాల్ పాఠశాల నుంచి 137 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

సీఎస్, డీవోల ఎంపిక పూర్తి..

పరీక్షల నిర్వహణలో కీలకమైన చీఫ్ సూపరింటెండెంట్లు (సీఎస్), డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ల (డీవో) ఎంపిక పూర్తయింది. ప్రతి పరీక్ష కేంద్రానికి ఒక సీఎస్, ఒక డీవో ఉండనున్నారు. 98 మంది సీఎస్‌లను, 98 మంది డీవోలను ఎంపిక చేశారు. వీరితో కస్టోడియర్, జాయింట్ కస్టోడియన్ అధికారులను ఎంపిక చేశారు. వీరితోపాటు ఇన్విజిలేటర్ల ఎంపికకు సంబంధించి ప్రధానోపాధ్యాయుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. లాంగ్వేజెస్, నాన్ లాంగ్వేజెస్ పద్ధతిలో ఇన్విజిలేషన్ విధులు కేటాయించనున్నారు.

పీవీకి 'భారతరత్న' పట్ల పలువురి హర్షం

ఖమ్మం, ఫిబ్రవరి 9 : నయా ఆర్థిక విధానాల సృష్టికర్త, తెలంగాణ బిడ్డ, మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకి భారత ప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'భారతరత్న'ను ప్రకటించడం పట్ల పలువురు ప్రముఖులు వేర్వేరు ప్రకటనల్లో శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. అద్భుతమైన పరిపాలన, ఆర్థిక సంస్కరణలతో దేశ ఖ్యాతిని ఖండాంతరాలకు చాటిన తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహారావుకు భారతరత్న ఇవ్వడం పట్ల యావత్ తెలంగాణ సమాజం గర్విస్తున్నదని బీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత, ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. పీవీకి భారతరత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ కేసీఆర్ హయాంలో అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కేసీఆర్ సర్కార్ పీవీకి సుముచిత స్థానం కల్పించి వర్ధంతి, జయంతితోపాటు ఏడాదిపాటు పీవీ శత జయంతోత్సవాలు నిర్వహించిందని తెలిపారు. దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తొలి తెలుగు వ్యక్తి పీవీ అని, సంస్కరణలు తీసుకొచ్చి దేశాన్ని ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించిన గొప్ప నాయకుడని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ పేర్కొన్నారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, మెచ్చా నాగేశ్వరరావు, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్, బ్రాహ్మణ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు, మామునూరు మురళీధర్‌రావు, హైకోర్టు న్యాయవాది ఈశ్వర ప్రగడ హరిబాబు, బ్రాహ్మణ సంఘం నాయకులు వనం కృష్ణవేణి, బ్రాహ్మణ సంక్షేమ సంఘ సమాఖ్య నాయకులు సూరవజ్జల వాసు, తాటికొండాల సీతారామ శాస్త్రి, మాటూరి లక్ష్మీనారాయణ, సర్వసతీభట్ల శ్రీధర్, ఆమంచి సురేశ్ తదితరులు ఉన్నారు.

మంత్రుల హర్షం..

పీవీ నర్సింహారావుకు ప్రభుత్వం భారత రత్న ప్రకటించడం పట్ల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలు శుక్రవారం వేరు వేరు ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

ప్రత్యామ్నాయ 'మార్గం' చూడండి..

పాపటపల్లి-జాన్‌పాడ్ రైల్వే లైన్ రద్దు చేయాలి..
కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఎంపీ వద్దిరాజు వినతి


కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ రవిచంద్ర

ఖమ్మం, ఫిబ్రవరి 9 : రైతుల పంట భూములకు నష్టం కలిగించే విధంగా ఖమ్మం శివారు పాపటపల్లి నుంచి సూర్యాపేట జిల్లా జాన్‌పాడ్ వరకు నూతనంగా నిర్మించ తలపెట్టిన రైల్వే లైన్‌ను తక్షణమే రద్దు చేయాలని, ప్రత్యామ్నాయ మార్గంలో సర్వే చేపట్టాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. శుక్రవారం పార్లమెంట్ ఆవరణలో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను ఎంపీ రవిచంద్ర ఆధ్వర్యంలో బాధిత రైతు ప్రతినిధులు వల్లూరి పట్టాభి, బానోత్ చంద్రావతి, గుర్రం రాముతో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రతిపాదిత రైల్వే లైన్ మార్గంలో ఎక్కువగా దళిత, గిరిజన, పేద రైతులకు చెందిన సాగు భూములు ఉన్నాయని, వారికి అవే ఆధారమని, ఆ భూములు కోల్పోతే జీవనోపాధి పూర్తిగా దెబ్బతింటుందని విన్నవించారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర.. ప్రతిపాదిత లైన్‌కు ప్రత్యామ్నాయంగా మరో మూడు మార్గాల గురించి మంత్రికి సూచించారు. ప్రత్యామ్నాయ మార్గాలను కచ్చితంగా పరిశీలించి.. రైతులకు నష్టం జరగకుండా చూస్తానని, ప్రస్తుత సర్వే పనులను నిలుపుదల చేసేలా తక్షణమే ఆదేశాలు ఇస్తానని రైల్వే మంత్రి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. అలాగే గార్ల రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలపై ఎంపీ రవిచంద్ర కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఉన్న ప్లాట్ ఫాంలను విస్తరించాలని, స్టేషన్‌లో డిస్ ప్లే బోర్డులు పెట్టాలని, శాతవాహన, ఇంటర్ సిటీ రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని కోరారు. వీటిపై కూడా రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

రెన్యువల్ చేయించుకున్న రైతులందరికీ రుణమాఫీ వర్తింపు

డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం

మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 9 : పంట రుణాలు తీసుకున్న రైతులు ఏడాదిలోగా తిరిగి చెల్లిస్తే 3 శాతం వడ్డీ రాయితీ వర్తిస్తుందని, సకాలంలో రెన్యువల్ చేయించుకోకపోతే 13 శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుందని డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం అన్నారు. శుక్రవారం డీసీసీబీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బ్యాంకు సీఈవో అబీద్ ఉర్ రెహమాన్‌తో కలిసి ఆయన మాట్లాడారు. గడిచిన నాలుగేళ్లుగా బ్యాంకు అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న ఖాతాదారులు, రైతులు మరోమారు తమ పూర్తి సహకారం అందించాలన్నారు. పంట రుణాలు రెన్యువల్ చేయించుకున్న ప్రతి రైతుకు రుణమాఫీ వర్తిస్తుందని, అపోహలు నమ్మి రుణాలు చెల్లించకపోవడం సరికాదన్నారు. మార్టిగేజ్ రుణాలు తీసుకున్న ఖాతాదారులు ఆర్థిక సంవత్సరంలోగా తిరిగి చెల్లించాలన్నారు. మరికొద్ది రోజుల్లోనే మరో నాలుగు కొత్త బ్రాంచ్‌లు ఏర్పాటు చేయనున్నామని, దీనిపై ఇప్పటికే ఆర్‌బీఐకి ప్రతిపాదనలు పంపించామన్నారు. గత ఏడాది ఆశించిన మేర లాభాలు రావడంతో ఉద్యోగులు, అధికారులకు 45 రోజుల బోనస్ అందజేయడం సంతోషంగా ఉందన్నారు. తమ పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన నాడు బ్యాంక్ టర్నోవర్ రూ.22 కోట్లు ఉంటే.. ప్రస్తుతం రూ.30 కోట్లకు చేరువ కావడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలు, ఉద్యోగులు, రైతులు డీసీసీబీ సేవలు, పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఎన్‌పీఏ రుణాలపై ప్రత్యేక దృష్టి సారించామని, సత్వరమే సదరు ఖాతాదారులు తిరిగి రుణాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ పునుకొల్లు రాంబ్రహ్మం, జనరల్ మేనేజర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన 'గూడెం' క్రీడాకారులు

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 9 : హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 7,8 తేదీల్లో జరిగిన అండర్-15 రాష్ట్రస్థాయి రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు 20 మంది వివిధ కేటగిరీల్లో సత్తా చాటారు. 55 కేజీల బాలికల విభాగంలో గీతాహర్షిని జాతీయ స్థాయి క్రీడాకారులతో తలపడి బంగారు పతకాన్ని దక్కించుకుంది. ఆమె ఈ నెల 28 నుంచి మార్చి 5వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రం పాటియాలలో జరిగే జాతీయస్థాయి రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు డీవైఎస్‌వో సీతారాం తెలిపారు. కాగా.. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు శుక్రవారం ఇక్కడ అభినందించారు. కార్యక్రమంలో కాశీహుస్సేన్, నిహారిక, టి.వెంకటేశ్వర్లు, పీఈటీలు, పీడీలు రవి, శ్వేత, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందిస్తున్న డీవైఎస్‌వో సీతారాం

పెండింగ్ పనులన్నీ పూర్తి చేయండి

- భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల
- తిప్పనపల్లిలో పారిశుధ్య పనుల పరిశీలన

చంద్రుగొండ, ఫిబ్రవరి 9 : గ్రామంలో పెండింగ్‌లో ఉన్న పనులన్నీ సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ ప్రియాంక ఆల సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా తిప్పనపల్లి గ్రామాన్ని శుక్రవారం సందర్శించిన కలెక్టర్.. తొలుత వైకుంఠధామాన్ని పరిశీలించి అక్కడ మొక్క నాటారు. వైకుంఠధామంలో భవనంపై స్లాబ్ లేకపోవడంతో అధికారులను వివరాలు అడిగి తెలుసుకొని ఆ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించి చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. పారిశుధ్య పనుల బాధ్యత ప్రత్యేకాధికారుల దేనని స్పష్టం చేశారు. అనంతరం చంద్రుగొండ జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. గైర్హాజరు విద్యార్థుల గురించి హెచ్ఎం కృష్ణకుమారిని అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి వార్షిక పరీక్షలు పూర్తయ్యే వరకు ఉపాధ్యాయులకు ఎట్టి పరిస్థితుల్లోనూ సెలవులు ఇవ్వొద్దన్నారు. పాఠశాలలో మరుగుదొడ్లు లేవనే తదితర సమస్యలను జడ్పీటీసీ వెంకటరెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట డీపీవో లక్ష్మీరమాకాంత్, మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, ఎంపీడీవో రేవతి, తహసీల్దార్ సాజియాసుల్తాన, ఎంపీపీ బానోత్ పార్వతి, జడ్పీటీసీ కొణకండ్ల వెంకటరెడ్డి, ఎంపీటీసీలు దారా వెంకటేశ్వరరావు, లంకా విజయలక్ష్మి, ఏఈలు శ్రీనివాస్‌రావు, లకన్‌నాయక్, ఎంపీవో తులసీరాం, ఏపీఎం సంతోశ్ ఉన్నారు.

తిప్పనపల్లి వైకుంఠధామాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక

ఈవీఎంలు, వీవీ ప్యాట్ల మొదటిస్థాయి పరిశీలన

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో జరుగుతున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎం), వీవీ ప్యాట్ల మొదటిస్థాయి పరిశీలనను కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు 1600 కంట్రోల్ యూనిట్లు, 2800 వీవీ ప్యాట్లు, 1500 బ్యాలెట్ యూనిట్లు వచ్చాయని తెలిపారు. నేటివరకు 790 యూనిట్ల ప్రాథమిక పరిశీలన పూర్తి అయ్యిందని, ఈ నెల 14వ తేదీ వరకు అన్ని యూనిట్ల పరిశీలన పూర్తవుతుందని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో ఈవీఎంల మొదటివిడత పరిశీలన చాలా ముఖ్యమైనదని, ఈ ప్రక్రియ మొత్తం గట్టి భద్రత, సీసీ టీవీల పర్యవేక్షణలో జరుగుతున్నట్లు తెలిపారు. ఈసీఐఎల్‌కు చెందిన సాంకేతిక నిపుణుల బృందం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్డీవో శిరీష, కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య, ఎన్నికల విభాగం తహసీల్దార్ దారా ప్రసాద్, నాయబ్ తహసీల్దార్ రంగా ప్రసాద్, సిబ్బంది నవీన్, అశోక్ పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 9 : వచ్చే పార్లమెంట్ ఎన్నికల కోసం జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని ఈవీఎం గోడౌన్‌లో గల అదనపు ఈవీఎంలను వినియోగించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. శుక్రవారం పార్టీల ప్రతినిధుల సమక్షంలో జడ్పీ ప్రాంగణంలోని గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలను నూతన కలెక్టరేట్ ఆవరణలో ఫస్ట్ లెవల్ చెకప్‌కు తరలించారు. జిల్లా పరిషత్ ఈవీఎం గోడౌన్‌లో 810 బ్యాలెట్ యూనిట్లు, 716 కంట్రోల్ యూనిట్లు, 807 వీవీ ప్యాట్లను ఈ సందర్భంగా నూతన గోడౌన్‌కు తరలించినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాంబాబు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పి.శ్రీనివాస్, జీఎస్ఆర్ఏ.విద్యాసాగర్, జి.పున్నయ్య, ఏ.గోపాలరావు, కె.కరుణాకర్, అధికారులు పాల్గొన్నారు.


ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ గౌతమ్

ప్ర.ర.వే మహాసభలను విజయవంతం చేయండి

మాట్లాడుతున్న వేదిక జాతీయ అధ్యక్షురాలు అనిశెట్టి రజిత, జాతీయ కార్యదర్శి కె.ఎస్.మల్లీశ్వరి

ఖమ్మం, ఫిబ్రవరి 9: ప్రజాప్వామిక రచయిత్రుల వేదిక (ప్ర.ర.వే) ఏర్పడి 15 ఏళ్లవుతున్న సందర్భంగా శని, ఆదివారాల్లో ఖమ్మం నగరంలో జరిగే మహాసభలను విజయవంతం చేయాలని వేదిక జాతీయ అధ్యక్షురాలు అనిశెట్టి రజిత, జాతీయ కార్యదర్శి కె.ఎస్.మల్లీశ్వరి పిలుపునిచ్చారు. నగరంలోని హార్వెస్ట్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రచయిత్రులందరినీ ఒక వేదిక పైకి తీసుకొచ్చేందుకే ప్ర.ర.వే ఏర్పాటు చేశామన్నారు. మహాసభలకు ఓల్గా, ఆచార్య ఘంటా చక్రపాణి, జి.ఎస్.రామ్మోహన్, రవిమారుత్, సంధ్య, విమలక్క, బైరి నరేశ్, ఉదయభాను, సూరేపల్లి సుజాత, తులసీ చందు, ఎన్.వేణుగోపాల్, కె.సునీతారాణి, కృష్ణకుమారి, కొండేపూడి నిర్మల, కొండవీటి సత్యవతి, అరుణ గోగులమండ, మెర్సీ మార్గరెట్, ఖాలీద్ ఫర్వీన్, దీప్తి సిర్ల, ఆదిత్య కొర్రపాటి, వి.ప్రతిమ, శిలాలోలిత, కొల్లాపురం విమల, ప్రసేన్, సీతారాం, సజయ, సి.వనజ, కె.శ్రీదేవి, మలుపు బాల్‌రెడ్డి, నారాయణ, వేణు, దాసరి అమరేంద్ర, రేణుక అయోలా, మానస ఎండ్లూరి, కె.రామలక్ష్మి, తిరునగరి దేవకీదేవి, కాత్యాయని విద్మహే, పి.రాజ్యలక్ష్మి, డి.ఎల్ సుహాసిని వంటి 200 మంది సాహితీవేత్తలు, సామాజిక ఉద్యమకారులు, జర్నలిస్టులు, ప్రొఫెసర్లు హాజరవుతున్నారని తెలిపారు. వీరంతా ప్రస్తుత సమాజాన్ని కలవర పెడుతున్న 'స్త్రీలపై ట్రోలింగ్' అనే అంశంపై మాట్లాడతారన్నారు. దేశంలో నెలకొన్న కుల, మతతత్వ విద్వేషాలు, అప్రజాస్వామిక ధోరణులపై చర్చిస్తారన్నారు. సమాజంలో ఏ చెడు ధోరణి ఏర్పడినా, ముందుగా దాని ప్రభావం మహిళలు, ఎస్సీ, మైనార్టీ వర్గాలపైనే ఉంటుందన్నారు. ఈ సమస్యలను సూక్ష్మ స్థాయిలో అర్థం చేసుకోవడానికే తమ వేదిక మహాసభలు నిర్వహిస్తున్నదన్నారు.

శిథిల భవనాలను తనిఖీ చేయండి

ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 9 : ఖమ్మంలో ఇటీవల కూలిన గ్రంథాలయ భవనం వంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ఇంజినీరింగ్ అధికారులు ప్రభుత్వ శిథిల భవనాలను తనిఖీ చేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ భవనాలపై చేపట్టిన చర్యలపై శుక్రవారం నూతన కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవనాల తనిఖీ సమయంలో రిజిస్టర్ నిర్వహించి అందులో రిమార్కులు పొందుపర్చాలన్నారు. వర్షపు నీరు భవనాల స్లాబ్, వెంటిలేటర్ల వద్ద నిల్వకుండా ఉండేలా చూడాలని, టాయిలెట్ల లీకేజీలతో కూడా భవనం దెబ్బతింటుందని, ఈ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఇంజినీరింగ్ శాఖలు తమ తమ పరిధిలోఎన్ని భవనాలు శిథిలావస్థకు చేరాయి.. ఎన్ని కూల్చి వేశారు.. ఎన్నింటికి మరమ్మతులు చేసి ఉపయోగంలోకి తీసుకురావొచ్చో లేదో నివేదిక సమర్పించాలని ఆదేశించారు కూల్చివేతకు నోటీసులు జారీ చేసి ఆర్థిక భారం పడకుండా చర్యలు చేపట్టాలన్నారు. నూతన భవన నిర్మాణాల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్యాంప్రసాద్, పీఆర్ ఎస్ఈ చంద్రమౌళి, పీఆర్, గిరిజన, విద్యా శాఖ ఈఈలు పాండురంగ విఠల్, నాగశేషు, తానాజీ, జిల్లా వ్యవసాయాధికారిణి విజయనిర్మల, జిల్లా గిరిజన సంక్షేమాధికారిణి విజయలక్ష్మి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వేణు మనోహర్, డీఈవో సోమశేఖరశర్మ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి జయప్రకాశ్, జిల్లా బీసీ సంక్షేమాధికారిణి జ్యోతి, కలెక్టరేట్ ఏవో అరుణ, షెడ్యూల్ సంక్షేమ శాఖ ఆర్‌సీవో ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్

స్కాట్స్ అండ్ గైడ్స్ ఉద్యమంలో యువతను భాగస్వాములను చేయాలి

సింగరేణి జీఎం బసవయ్య

కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 9 : దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, విపత్తుల సమయంలో ధైర్యంగా సేవ చేసేందుకు విద్యార్థులకు స్కాట్స్ అండ్ గైడ్స్ ఉద్యమం ఎంతో దోహదపడుతుందని జీఎం పర్సనల్ బసవయ్య అన్నారు. శుక్రవారం స్కాట్స్ అండ్ గైడ్స్ ప్యాట్రోల్ లీడర్ శిక్షణా శిబిరాన్ని స్థానిక చిల్డ్రన్స్ పార్కులో ఆయన ప్రారంభించారు. ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు తెలంగాణలోని వివిధ జిల్లాల పాఠశాల విద్యార్థులకు ఐదురోజులు శిక్షణ ఇవ్వనున్నారు. నేర్చుకున్న అంశాలపై పట్టు సాధించి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీవైఎంఎం సుశీల్‌కుమార్, కొత్తగూడెం, ఇల్లెందు, గోలేటి, మందమర్రి పాఠశాలల నుంచి, మాస్టర్ ఈకే విద్యాలయం, శ్రీశారద విద్యాలయం, సెయింట్ విన్సెంట్, బాలాజీ స్కూల్, భూపాలపల్లి, ఉజ్వల ఉన్నత పాఠశాల, ఫాతిమా ఉన్నత పాఠశాల, కాగజ్‌నగర్, కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాల, స్కాట్స్ స్టూడెంట్స్, వారి స్కాట్ మాస్టర్లు, రోవర్ స్కాట్ లీడర్లు, రోవర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జీఎం పర్సనల్ బసవయ్య